క్లుప్తంగా

రైతులకు అందుబాటులో యూరియా


యూరియాను రైతులకు అందిస్తున్న వ్యవసాయ అధికారి

గోస్పాడు: యూరియ అందుబాటులో ఉందని, అవసరమైన రైతులు తీసుకోవచ్చునని వ్యవసాయ అధికారి స్వప్నికారెడ్డి తెలిపారు. సోమవారం మండల కేంద్రమైన గోస్పాడులోని దుకాణంలో రైతులకు ఎరువులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రైవేటు ఎరువుల దుకాణాల్లో 50 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. వెంకట సాయి ఫర్టిలైజర్‌లో 38 టన్నులు, శ్రీకర ఫర్టిలైజర్‌లో 12 టన్నులు యూరియా ఉందన్నారు. అలాగే దీబగుంట్ల, యాల్లూరు గ్రామాల్లోని రైతు సేవ కేంద్రాల్లో కూడా స్టాక్ ఉందని, అవసరమై రైతులు ఎమ్మార్పీకి తీసుకోవచ్చునని చెప్పారు. ఎవరైనా అధిక ధరలకు విక్రయిస్తే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

బీసీ రుణమేళాకు 3,274 దరఖాస్తులు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని మున్సిపల్ టౌన్‌హాల్‌లో సోమవారం నిర్వహించిన బీసీ రుణమేళాకు 3,274 మంది హాజరై దరఖాస్తులు అందజేశారు. మునిసిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో వివిధ బ్యాంకుల ప్రతినిధులు అభ్యర్థుల దరఖాస్తులను పరిశీలించారు. అర్హులకు సబ్సిడీ రుణాలు మంజూరు చేస్తామని అసిస్టెంట్ కమిషనర్ తెలిపారు.

నంద్యాల(అర్బన్): మండలంలోని పోలూరు, అయ్యలూరు గ్రామాల్లో సోమవారం బీసీ కార్పొరేషన్ ద్వారా అందించే సబ్సిడీ రుణాలకు అధికారులు దరఖాస్తులు స్వీకరించి పరిశీలించారు. అయ్యలూరు గ్రామంలో ఎంపీడీఓ, పోలూరులో ఈఓఆర్‌డీఓ జ్యోతి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

ఉన్నత విద్యతోనే ఉజ్వల భవిష్యత్


నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ఆళ్లగడ్డ: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత విద్యను అభ్యసిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని కేవీ సుబ్బారెడ్డి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మల్లేశ్వర్‌రెడ్డి అన్నారు. స్థానిక ఆ జూనియర్ కళాశాలలో సోమవారం సీనియర్‌కు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత శిఖరాలను చేరుకుని కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి గుర్తింపు తీసుకురావాలన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ప్రతిభ కనబరిచిన విజేతలకు బహుమతులు అందజేశారు.

పశువ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


రైతులకు మందులు అందజేస్తున్న అధికారులు

రుద్రవరం: మూగజీవాలకు సోకే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎర్రగుడిదిన్నె పశు వైద్యాధికారి మనోరంజన్ ప్రతాప్ రైతులకు సూచించారు. మండల పరిధిలోని ఎల్లావత్తుల, శ్రీరంగాపురం గ్రామాల్లో సోమవారం అటవీ శాఖ సహకారంతో పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ రెండు గ్రామాల్లో దాదాపు 1,625 పశువులకు గొంతువాపు నివారణకు సంబంధించి టీకాలు వేశారు. కార్యక్రమంలో చెలిమ రేంజ్ అధికారి ఉదయ్‌దీప్, సెక్షన్ అధికారి కిషోర్ కుమార్, ఎఫ్‌బీఓలు రామారావు, నాగప్ప తదితరులు పాల్గొన్నారు.

మెరిట్ స్కాలర్‌షిప్‌నకు విద్యార్థిని ఎంపిక

ఉయ్యాలవాడ: మండలంలోని మాయలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న మౌనిక నేషనల్ మెరిట్ స్కాలర్‌షిప్‌నకు ఎంపిక అయినట్లు ప్రధానోపాధ్యాయుడు మహమ్మద్ షరీఫ్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి ఏడాది రూ. 12 వేలు చొప్పున నాలుగు సంవత్సరాల పాటు విద్యార్థినికి స్కాలర్‌షిప్ అందజేస్తుందని చెప్పారు. ఎంపికైన విద్యార్థినిని హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన దిగుబడులు

చాగలమర్రి: ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చునని ఏఈఓ న్యామతుల్లా తెలిపారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఉత్పత్తులు ఆకుకురలు, కూరగాయలను ముత్యాలపాడు యూనిట్ ఇనచార్జ్ నాగేశ్వరరెడ్డి, పెద్దవంగలి యూనిట్ ఇన్‌చార్జి కదిరి బాషా ప్రదర్శించారు. కార్యక్రమంలో డీటీ విజయ్‌కుమార్ ఐసీఆర్‌పీలు లక్ష్మయ్య, లక్ష్మీనరసమ్మ, నంద్యాల రవి, వీరభద్రుడు, పుట్ట రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడిని జయిస్తే విజేత మీరే!

- మార్చి 1 నుంచి ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు
- 17 నుంచి పదోతరగతి పరీక్షలు
- పుస్తకాలతో కుస్తీ పడుతున్న విద్యార్థులు
- భయం వీడి ప్రణాళికతో చదువుకోవాలంటున్న నిపుణులు
- జిల్లాలో 53 కేంద్రాల్లో ఇంటర్, 130 కేంద్రాల్లో పది పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు


చాపిరేవుల జెడ్పీ హైస్కూల్ ఆవరణలో చదువుకుంటున్న పదోతరగతి విద్యార్థులు

నంద్యాల(న్యూటౌన్): విద్యార్థి దశలో అత్యంత ముఖ్యమైన పబ్లిక్ పరీక్షలకు సమయం ఆసన్నమైంది. ఇంటర్ పరీక్షలకు 4 రోజులు, పదోతరగతి పరీక్షలకు 21 రోజుల గడువు మాత్రమే మిగిలి ఉంది. సమయం సమీపిస్తుండటంతో పిల్లలు పుస్తకాలతో కుస్తీపడుతున్నారు. అయితే, ఆయా పరీక్షల్లో ఉత్తీర్ణతతో పాటు మంచి మార్కులు సాధించాలంటే ఒత్తిడికి గురికాకుండా నేర్చుకున్న పాఠాలను ఎక్కువసార్లు రివిజన్ చేసుకోవాలని విద్యావేత్తలు సూచిస్తున్నారు. టెన్షన్ పడితే ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

53 కేంద్రాల్లో పరీక్షలు...

జిల్లాలో మార్చి 1వ తేదీ నుంచి ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు జరగనుండగా, టెన్త్ క్లాస్ పరీక్షలు మార్చి 17వ తేదీ నుంచి ప్రారంభకానున్నాయి. జిల్లా వ్యాప్తంగా 53 కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు జరగనున్నాయి. ఈ పరీక్షలకు 29,092 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఇక పదో తరగతి పరీక్షలను 130 కేంద్రాల్లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తుండగా 25,542 మంది విద్యార్థులు రాయనున్నారు. ఓపెన్ స్కూల్ టెన్త్ విద్యార్థులు 667 మంది, ఇంటర్ విద్యార్థులు 940 మంది పరీక్షలకు ఫీజులు చెల్లించారు. ఈ పరీక్షల నిర్వహణకు విద్యాశాఖ అధికారులు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

విద్యార్థులూ ఇవి గుర్తుంచుకోండి..

- పాఠ్యాంశాలను పక్కాగా రివిజన్ చేసుకోవాలి. కొత్త అంశాల జోలికి వెళ్లకూడదు.
- టైం టేబుల్ సిద్ధం చేసుకోవాలి.
- కాస్త కష్టమైన సబ్జెక్టులకు ఎక్కువ సమయం కేటాయించాలి.
- రివిజన్‌లో ముఖ్యమైన పాయింట్లు రాసుకోవాలి.
- పరీక్షల సమయంలో క్విక్ రివిజన్ ఎంత గానో ఉపయోగపడుతుంది.
- తోటి విద్యార్థులతో అప్పుడప్పుడు సబ్జెక్టుపై చర్చించుకోవాలి.
- పాత ప్రశ్న పత్రాలు, మోడల్ ప్రశ్న పత్రాలను ఎక్కువ ప్రాక్టీస్ చేయాలి.
- సమతుల ఆహారం తీసుకోవాలి. బయట హోటల్స్ ఫుడ్ తీసుకోకపోవడం మంచిది. అలాగే విరామం లేకుండా చదవడం సరికాదు.
- ప్రశాంతంగా రోజుకి 6 నుంచి 7 గంటల పాటు నిద్రపోవాలి.
- పూర్తి పాజిటివ్ మైండ్ సెట్‌తో ఉండాలి. ఎవరి మాటలకు తలొగ్గకూడదు. ఒత్తిడికి గురవ్వకూడదు.
- పరీక్షలు ముగిసే వరకు మరీ ముఖ్యంగా సెల్ ఫోను, సినిమాలకు, సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలి.

సమయం కీలకం



సమయాన్ని ఎంత తెలివిగా వినియోగించుకున్నామనే అంశంపైనే సాధించే మార్కుల శాతం. ఆధారపడి ఉంటుంది. సబ్జెక్టు, టాపిక్ ప్రాధాన్యతలను గుర్తించి ఉన్న కొద్దిపాటి సమయాన్ని విభజించి కేటాయింపు చేసుకోవాలి. పరీక్షలు దగ్గర పడే కొద్దీ చాలా మంది గంటల తరబడి పుస్తకాల ముందు కూర్చుంటారు. అలా కాకుండా అప్పుడప్పుడు స్వల్ప విరామం ఇవ్వడం మంచిది.

– చక్రధర్‌రెడ్డి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, నంద్యాల

చేతిరాతపై దృష్టి పెట్టాలి



నీ పని నువ్వు శ్రద్ధగా చేయు.. ఫలితం దానంతట అదే వస్తుందన్న నానుడిని విద్యార్థులు మరువకూడదు. సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ రివిజన్ పదేపదే చేస్తుండాలి. వెనుకబడిన సబ్జెక్టులు, టాపిక్‌లపై ఎక్కువ దృష్టి సారించాలి. ఒత్తిడిని జయించేందుకు ఉపాధ్యాయులు సూచనలు చేస్తుండాలి. ముఖ్యంగా మార్కులకు దోహదం చేసే చక్కటి చేతిరాతపైనా దృష్టి పెట్టాలి.

–జనార్దన్‌రెడ్డి, డీఈఓ

ఆరోగ్యమే మహాభాగ్యం



ఆరోగ్యంగా ఉన్నప్పుడే పిల్లలు ఆత్మవిశ్వాసంతో పరీక్ష రాయగలరు. ప్రిపరేషన్‌లో పడి ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేయకూడదు. ప్రోటీన్లతో కూడిన ఆహారం తీసుకోవాలి. తగిన నిద్రతోపాటు రోజూ క్రమం తప్పకుండా కొద్ది సమయం వ్యాయామం చేయగలిగితే ఉల్లాసంగా ఉండగలుగుతాం. ముఖ్యంగా ఫలితం గురించి ఆలోచించకుండా, మానసికంగా ప్రశాంతంగా ఉండడం అలవాటు చేసుకోవాలి.

–వెంకటరమణ, డీఎంఅండ్‌హెచ్‌ఓ

రివిజన్ కీలకం



విద్యార్థులు పరీక్షల సమయంలో తమకు రాని ప్రశ్నలపై ఎక్కువగా దృష్టిపెట్టి, వచ్చిన వాటిపై కాస్త నిర్లక్ష్యం వహిస్తారు. అయితే ఎంతో బాగా నేర్చుకున్న సమాధానాలైనా కొన్నిరోజులకు మర్చిపోయే ప్రమాదం ఉంది. కాబట్టి విద్యార్థులు నేర్చు కున్న అంశాలను కూడా తరచూ రివిజన్ చేస్తుండాలి. ఇంటర్ పరీక్షలకు కేవలం నాలుగు రోజుల వ్యవధి ఉంది. అన్ని పాఠశాలల్లో పదోతరగతి సిలబస్ పూర్తయ్యింది. ఈ సమయంలో విద్యార్థులకు రివిజన్ చాలా కీలకం. – జీవలత, ఎస్పీజీ హైస్కూల్ హెచ్‌ఎం, నంద్యాల

అహోబిలేశుడికి విశేష పూజలు


పూజలందుకుంటున్న ఉత్సవమూర్తులు

రుద్రవరం: పార్వేట ఉత్సవాల్లో భాగంగా ఉత్సవ మూర్తులు జ్వాలా నరసింహ స్వామి, ప్రహ్లాద వరదస్వామి మండల కేంద్రమైన రుద్రవరంలో విశేష పూజలందుకున్నారు. రెండో రోజు స్వామివారి పల్లకీ గ్రామంలోని పాత తెలుగుపేట, ఆర్యవైశ్య కాలనీల్లో ఊరేగి అక్కడి తెలుపుల మీ ద కొలువుదీరగా ఆయా కాలనీవాసులు స్వామి వారికి పూజలు చేశారు. స్వామి పల్లకీ రాకతో గ్రామంలో పండుగ సందడి నెలకొంది.

ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోండి

దొర్నిపాడు: ఆధార్‌కార్డుల సవరణ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సావిత్రి తెలిపారు. సోమవారం మండలంలోని కొండాపురం గ్రామ సచివాలయంలో ప్రత్యేక ఆధార్ క్యాంప్ నిర్వహించారు. 25 మందికి ఆధార్‌లో మార్పులు చేర్పులు చేసినట్లు చెప్పారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

నంద్యాల(వ్యవసాయం): అడ్వకేట్స్ ఎమెండ్ బిల్లును రద్దు చేయాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు.బిల్లును వ్యతిరేకిస్తూ సోమవారం న్యాయవాదులు విధులను బహిష్కరించారు. అనంతరం నంద్యాల న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు దుర్గాప్రసాద్, భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం న్యాయవాద సవరణ బిల్లును తీసుకురావడం సరికాదన్నారు. ఈ అంశంపై మంగళవారం కూడా న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరిస్తున్నట్లు తెలిపారు.

పీజీఆర్‌ఎస్‌కు అధికారులు గైర్హాజరు


ప్రజా వేదికలో అధికారులు లేక ఖాళీగా ఉన్న కుర్చీలు

ఉయ్యాలవాడ : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు పలువురు అధికారులు డుమ్మా కొట్టారు. ప్రజల ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించి వాటి పరిష్కారానికి మండల స్థాయి అధికారులు చొరవ తీసుకోవాలని ఆదేశాలు జారీ చేస్తున్నా కొందరు తమకేమి పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. పీజీఆర్‌ఎస్‌కు కూడా హాజరుకావడం లేదు. సోమవారం రెవెన్యూ కార్యాలయంలో జరిగిన వినతుల స్వీకరణ కార్యక్రమానికి తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, హౌసింగ్ ఏఈ నరసింహరావు, ఏపీఓ రవిప్రకాష్ హాజరుకాగా పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, విద్య, పశు వైద్యం, మైనర్ ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ తదితర 20 శాఖల అధికారులు సమావేశానికి గైర్హాజరయ్యారు.

పారదర్శకతకే సామాజిక తనిఖీ


ప్రజావేదికలో మాట్లాడుతున్న డ్వామా పీడీ వెంకటసుబ్బయ్య

ఆళ్లగడ్డ: గ్రామాల్లో ఉపాధిహామీ పథకం పారదర్శకంగా, నిబంధనల ప్రకారం అమలు చేసేందుకే ఏటా సామాజిక తనిఖీ నిర్వహించి ప్రజా వేదికలో సమీక్షిస్తున్నట్లు డ్వామా పీడీ వెంకటసుబ్బయ్య తెలిపారు. ఆళ్లగడ్డ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సోమవారం నిర్వహించిన 18వ విడత ప్రజా వేదికలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వలసలను నివారించి స్థానికంగానే ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తుందన్నారు. ఈ సామాజిక తనిఖీలో రూ. 2,89,583 అవకతవకలు జరిగినట్లు గుర్తించామని తెలిపారు. కార్యక్రమంలో ఏపీడీలు సాంబశివరావు, బాలాజీనాయక్, ఎంపీడీఓ మహబూబ్‌ఖాన్, ఎస్ఆర్పీ మురాద్, ఏపీఓ గణేష్, పీఆర్, హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఉన్నారు

సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలి


ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

నంద్యాల(న్యూటౌన్): భవన నిర్మాణ కార్మికులకు సంబంధించిన సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఆ సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు రఘురామ్మూర్తి, పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్రంలో వేలాది మంది కార్మికులు భవన నిర్మాణంపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. అయితే, ప్రస్తుతం చాలా మంది పనులు లేక అవస్థలు పడుతున్నారని, వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కలెక్టరేట్ ఏఓ రవికుమార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు విష్ణు, పోచయ్య, శాలీబాషా, అహమ్మద్ హుసేన్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమిస్తాం


మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

నంద్యాల (న్యూటౌన్): మున్సిపల్ ఉద్యోగులు, కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమిస్తామని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రసాద్, నాయకుడు శ్రీనివాసులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ అంశంపై రాష్ట్ర సమితి పిలుపు మేరకు సోమవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు.అనంతరం ఏఐటీయూసీ నాయకులతో పాటు మున్సిపల్ పారిశుద్ధ్య కాంట్రాక్ట్ కార్మిక సంఘం నాయకులు రంజిత్, పర్మనెంట్ వర్కర్స్ యూనియన్ నాయకులు కోటయ్య, ప్రభాకర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆప్కాస్ రద్దు చేస్తే మున్సిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికులకు వేతనాలు నగరపాలక సంస్థ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇందుకు విరుద్ధంగా ప్రైవేటు ఏజెన్సీ కంపెనీలకు అప్పగిస్తే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామన్నారు. పారిశుద్ధ్య కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, పెండింగ్‌లో డీఏలు సత్వరమే విడుదల చేయాలని, జనాభా ప్రాతిపదికన మున్సిపాలిటీలో కార్మికుల సంఖ్య పెంచాలని డిమాండ్ చేశారు. ఔట్‌సోర్సింగ్ కార్మికుల రిటైర్‌మెంట్ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని మున్సిపల్ అధికారి మురళీకి అందజేశారు. కార్యక్రమంలో మహిళా నాయకులు జయమ్మ, చిన్నమ్మ, ఎస్తేరమ్మ, రాణెమ్మ, మస్తానమ్మ, ప్రతాప్, ఓబులేసు, శివరాముడు, వరద బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

బీసీ కుల గణన చేపట్టాలి


డీఆర్‌ఓకు వినతిపత్రం అందజేస్తున్న బీసీ నాయకులు

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్రంలో బీసీ కుల గణన చేపట్టాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుమ్మరి ప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం నంద్యాల జిల్లా డీఆర్‌ఓను ప్రజా సమస్యల వేదికలో కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కుక్కలు, పులులు, సింహాల గణన చేపట్టే పాలకపార్టీలు బీసీల కులగణన చేయకపోవడం అన్యాయమన్నారు. ప్రభుత్వాల తీరుతో బీసీలు విద్యా, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ రంగాల్లో తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. బీసీలకు విద్యా, ఉద్యోగ రంగాల్లో ఏబీసీడీ వర్గీకరణ చేసిన విధంగానే రాజకీయ రంగాల్లో కూడా ఏబీసీడీ వర్గీకరణ చేపట్టి ఎంబీసీ కులాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో బీసీల అభివృద్ధికి సబ్ ప్లాన్ అమలుకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలన్నారు. కార్యక్రమంలో వర్కింగ్ కమిటీ నాయకులు పృధ్వీరాజ్‌యాదవ్, ఆల్వకొండ మద్దిలేటి, యువజన విభాగం ఉపాధ్యక్షుడు మధు, మురళీ, రాము, తదితరులు పాల్గొన్నారు.

క్రీడా భారతిని అన్ని ప్రాంతాల్లో విస్తరించాలి

నంద్యాల(న్యూటౌన్): క్రీడా భారతిని నంద్యాల ప్రాంతమే కాకుండా ఏపీ అంతటా విస్తరింపజేసి క్రీడాకారుల్లో ఉన్న నైపుణ్యాన్ని గుర్తించి ప్రోత్సహించాలని రామకృష్ణ డిగ్రీ కళాశాల అధినేత రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం ఎస్‌బీఐ కాలనీలోని పీజీ కళాశాలలో క్రీడా భారతి ఆంధ్రప్రదేశ్ ప్రాంత కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి దక్షిణ మధ్య సంయోజిక్ చంద్రశేఖర్, చైర్మన్ రామకృష్ణారెడ్డి, ఉపాధ్యక్షుడు మాణిక్యాలు, ఒలింపియాన్ వెయిట్ లిఫ్టింగ్ అధ్యక్షుడు, క్రీడా భారతి కార్యవర్గ సభ్యులు హాజరై క్రీడా భారతి క్యాలెండర్‌లోని కార్యక్రమాలను వివరించారు. సమావేశంలో క్రీడా భారతి సభ్యులు, శాంతినికేతన్ స్కూల్ చైర్మన్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పాడి పంటల పుస్తకాలు అందజేత

గోస్పాడు: మండలకేంద్రం గోస్పాడులోని రైతు సేవా కేంద్రంలో రైతులకు పాడి పంటల పుస్తకాలు అందజేశారు. వ్యవసాయ విస్తరణ అధికారి బాల నరసింహులు మాట్లాడుతూ పాడిపంటల పుస్తకంలో రైతులకు అవసరమైన విలువైన సమాచారం ఉంటుందన్నారు. పంటలు సాగు, పాడి పెంపకం తదితర వాటి విషయంలో ఆ సమాచారం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది శివరామకృష్ణ, హరితేజ, సుమలత పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

శిరివెళ్ల: మార్చి 1వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు యర్రగుంట్ల జీటీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు సోమవారం తెలిపారు. పరీక్ష కేంద్రంలో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 155 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 122 మంది పరీక్షలు రాయనున్నారన్నారు. పరీక్షల నిర్వహణకు చీఫ్ సూపరింటెంట్‌గా రమణకుమారి, డిపార్ట్ మెంటల్ అధికారిగా ఉయ్యలవాడ మోడల్ స్కూల్ అధ్యాపకుడు రాంమోహన్ నియమితులయ్యారన్నారు. పరీక్ష ఉదయం 9 గంటల నుంచి ప్రారంభమయి 12 గంటలకు ముగుస్తుందన్నారు. తమ పరీక్షా కేంద్రంలో కస్తూరిబా పాఠశాల విద్యార్థులు కూడా పరీక్షలు రాయనున్నారన్నారు. ఇదిలా ఉండగా మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతి ఏటా యర్రగుంట్ల సెంటర్‌లో పరీక్షలు రాసేవారు. అయితే, ఈ ఏడాడి గోస్పాడు మండలం దీబగుంట్ల జూనియర్ కళాశాల సెంటర్‌లో పరీక్షలకు హాజరవుతున్నారు.

ఆట పాటలతో విద్యనందించాలి

నంద్యాల(అర్బన్): అంగన్‌వాడీ చిన్నారులకు ఆట పాటలతో కూడిన విద్యను అందించడమే జ్ఞాన జ్యోతి కార్యక్రమ లక్ష్యమని ఎంఈఓ బ్రహ్మంనాయక్ తెలిపారు. స్థానిక చాంద్‌బాడ మున్సిపల్ హైస్కూల్‌లో జ్ఞాన జ్యోతిపై అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రీప్రైమరీ స్థాయిలోనే నైపుణ్యతతో కూడిన చదువులు అందించేందుకు ఈ శిక్షణ ఉపయోగపడుతుందని ఎంఈఓ అన్నారు..

ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టండి

నంద్యాల: ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని డీఆర్‌ఓ రామునాయక్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పీజీఆర్‌ఎస్ హాల్‌లో జిల్లా నలుమూలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఓ మాట్లాడుతూ వినతులను క్షుణ్ణంగా పరిశీలించి అర్జీదారుడు సంతృప్తి చెందేస్థాయిలో పరిష్కరించాలన్నారు. ప్రతి అధికారి తన లాగిన్‌లో ఉన్న అర్జీలను అదే రోజు చూడాలని పెండింగ్‌లో పెట్టకూడదన్నారు. డివిజన్, మండలం, మున్సిపాలిటీలలో ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో పాటు మినిట్స్ కాపీలను జిల్లా కేంద్రంలోని పీజీఆర్‌ఎస్ నోడల్ అధికారికి పంపాలన్నారు. ఇకనుంచి కార్యాలయపు దస్త్రాలన్నీ ఈ ఆఫీస్ ద్వారానే రావాలని లేనిపక్షంలో సంబంధిత అధికారులపై క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు.

చాగలమర్రి: మండలకేంద్రం చాగలమర్రిలో నిర్వహించి పీజీఆర్‌ఎస్‌కు స్పందన కరువైంది. ముగ్గురు మాత్రమే వినతులు తీసుకొచ్చి ఇచ్చారు. ఆ మూడు కూడా భూ సర్వేకు సంబంధించి ఉన్నట్లు డీటీ విజయ్‌కుమార్ తెలిపారు. ఇదిలా ఉంటే వ్యయప్రయాసలుకూర్చి అర్జీలు ఇచ్చినా అధికారులు పరిష్కార మార్గం చూపడం లేదని మండల ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

టిడ్కో గృహాలు కేటాయించాలి

నంద్యాల(న్యూటౌన్): పేదలకు టిడ్కో గృహాలు కేటాయించాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి సోమన్న డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మంత్రి ఫరూక్ అసెంబ్లీ సమావేశాల్లో అయ్యలూరు మెట్ట, వైఎస్సార్‌నగర్‌లలోని టిడ్కో గృహాల కేటాయింపు విషయాన్ని ప్రస్తావించాలన్నారు. ఎన్నికల హామీ మేరకు పేదలకు ఆ గృహాలు పంపిణీ చేయాలన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ కార్యదర్శి శ్రీనివాసులు, సీపీఐ కార్యదర్శి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీదేవికి పూజలు


సరస్వతి పూజలో ఉపాధ్యాయులు, విద్యార్థినులు

చాగలమర్రి: మండల కేంద్రం చాగలమర్రిలోని కస్తురిబాగాంధీ విద్యాలయంలో సోమవారం ఎస్‌ఓ సునీత అధ్వర్యంలో సరస్వతి పూజ నిర్వహించారు. చదువుల తల్లి ఆశీస్సులతో వచ్చేనెలలో జరిగే పదోతరగతి పరీక్షల్లో తమ విద్యార్థినులు మంచి మార్కులు సాధించాలని ఈ కార్యక్రమం నిర్వహించినట్లు వెల్లడించారు.

కొత్త పరిశోధనలకు ప్రోత్సాహం

నంద్యాల(అర్బన్): ఎస్‌వీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో కొత్త పరిశోధనలను ప్రోత్సహించేందుకే ఐస్ ల్యాండ్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు మెకానికల్ డిపార్టుమెంట్ హెడ్ శివరామకృష్ణయ్య, ట్రైనింగ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ రాకేష్‌బాబు తెలిపారు. స్థానిక కళాశాలలో ఐస్‌ల్యాండ్ కంపెనీకి చెందిన సీఈఓ థోర్మోడ్‌సన్, పుదుచ్చేరికి చెందిన నల్లాలతో సమావేశం నిర్వహించారు. కళాశాల మేనేజ్‌మెంట్ చైర్మన్ వెంకటరామిరెడ్డి, ఎండీ దినేష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ ఒప్పందం కుదరడంపై ఆనందంగా ఉందన్నారు.

ప్లాస్టిక్ రహిత పంచాయతీలుగా తీర్చిదిద్దాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఈఓఆర్డీ అనసూయ

గోస్పాడు: గ్రామాలను ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దాలని ఈఓఆర్‌డీ నాగ అనసూయ అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్‌తో తయారు చేసిన కవర్లు, గ్లాసులు, ప్లేట్లు వంటి ఏ ఇతర వస్తువులు కూడా వాడకుండా నిషేధించాలన్నారు. ఇందులో భాగంగా ఈనెల 27వ తేదీ నుంచి మార్చి 1వ తేదీ వరకు గ్రామాల్లోని దుకాణాలకు, వాణిజ్యసముదాయాలకు ప్లాస్టిక్ వాడకం నిషేధించేలా నోటీసులు జారీ చేయాలన్నారు. మార్చి రెండో తేదీ నుంచి ప్లాస్టిక్‌కు బదులు పేపర్ బ్యాగ్‌లు, క్లాత్ బ్యాగ్‌లు, జ్యూట్ బ్యాగ్‌లు దుకాణాల్లో విక్రయించేలా చూడాలన్నారు. ఈ విషయంలో ఏ ఒక్కరు నిర్లక్ష్యం చేయరాదని హెచ్చరించారు. ప్లాస్టిక్ వినియోగం పెరిగితే పర్యావరణం దెబ్బతింటుందని ప్రజలకు,వ్యాపారులకు అవగాహన కల్పించాలని సూచించారు.

హమాలీల గోడు పట్టని కూటమి సర్కారు


ధర్నా నిర్వహిస్తున్న హమాలీలు

నంద్యాల(న్యూటౌన్): అధికారంలోకి వచ్చి 9 నెలలవుతున్నా కూటమి సర్కారుకు హమాలీల గోడు పట్టడం లేదని సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు లక్ష్మణ్, జిల్లా కార్యదర్శి వెంకటలింగం అన్నారు. సివిల్ సప్లయ్ హమాలీల కూలి రేట్లు పెంచి వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం పట్టణంలోని టెక్కె మార్కెట్ యార్డు ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం కూలి రేట్ల పెంపు విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. 13 నెలలుగా చేసిన పనికి సంబంధించిన డబ్బు ఇవ్వలేదన్నారు. దీనిపై స్పందించకపోతే మార్చి 7న విజయవాడలో డీఎం కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వెంకటలింగం, గోపాల్, స్వాములు, తదితరులు పాల్గొన్నారు.